# పలుచోట్ల నేడు విద్యుత్ సరఫరా బంద్

ఉప్పల్, మే 30: విద్యుత్ మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఉప్పల్ భగాయత్ ఏఈ కిరణ్‌కుమార్ తెలిపారు. సత్యనగర్ ఫీడర్ పరిధిలోని సత్యనగర్, శాంతినగర్, ట్రైకలర్ అపార్ట్‌మెంట్స్, ఆదిత్య అపార్ట్‌మెంట్ లేన్, నల్ల పోచమ్మ టెంపుల్ లేన్ ప్రాంతాలలో ఉదయం 11 నుంచి 12.30 గంటల వరకు విద్యుత్ ఉండదన్నారు. 11 కేవీ జెర్సి ఫీడర్ పరిధిలోని జెర్సిలేన్, లక్ష్మీనారాయణ కాలనీ, అభయాంజనేయస్వామి టెంపుల్ లేన్, గుబ్బాలేన్, ఈఎస్ఐ హాస్పిటల్ లేన్, ఐడీఏ ఉప్పల్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 3.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ ఉండదన్నారు.

**నాచారం పరిధిలో..**

దుర్గానగర్, బాబానగర్, నాచారం విలేజ్, ఎర్రకుంట, అంబేద్కర్‌నగర్, కమలబాయినగర్, హనుమాన్‌నగర్, సావర్కర్‌నగర్, రాంరెడ్డినగర్, జనప్రియ అపార్ట్‌మెంట్, శ్రీరాంనగర్ ప్రాంతాల్లో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ నాగరాజు తెలిపారు. అదేవిధంగా కౌండిన్యనగర్, వైజయంతి థియేటర్ ప్రధాన రోడ్డు, రవీంద్రనగర్, సాయినగర్ ప్రాంతాల్లో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 వరకు, వీటితోపాటుగా శాంతిగార్డెన్ అపార్ట్‌మెంట్స్, ఇందిరానగర్, రాఘవేంద్రనగర్, కాంక్రీట్‌ప్లాజా అపార్ట్‌మెంట్స్, అన్నపూర్ణకాలనీ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 వరకు విద్యుత్ ఉండదన్నారు.

**ఘట్‌కేసర్ పరిధిలో...**

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు అవుశాపూర్,జగత్‌స్వప్న కాలనీ,కెపాల్,అనురాగ్ కళాశాల,వినూత్న కాలని,అరోరా కళాశాల,శ్రీనిధి రిసార్ట్స్,శ్రీవెల్లి కాలనీల్లో, మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5గంటల వరకు చందుపట్లగూడ,ఏదులాబాద్,కొత్తగూడ గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ జి. సతీష్ కుమార్ వివరించారు.

**నారపల్లి పరిధిలో..**

ఉదయం 10:30 నుంచి కొర్రెముల,వెంకటాపురం,చౌదరిగూడ,మక్త,తెనుగూడెం,బాలాజీ నగర్,సుభ్రాత్ టౌన్‌షిప్‌లో, మధ్యాహ్నం 2:30నుంచి సాయంత్రం 5గంటల వరకు అన్నానగర్,డాక్టర్స్ కాలనీ,జోడిమెట్ల ఎక్స్‌రోడ్డు, అరుంధతి కాలనీ,కాకాతీయ నగర్,స్వర్ణగిరి కాలనీ,వైష్ణవి నగర్,చౌదరిగూడ, వెంకటసాయినగర్,పద్మావతి కాలనీ,శేషాద్రికాలనీ,సీతమ్మ కాలనీ,జోడిమెట్ల,మేధాకంపిణి,పోచారం గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ ప్రదీప్ కుమార్ పేర్కొన్నారు.

**మేడ్చల్ పరిధిలో..**

మేడ్చల్: మేడ్చల్ మండల పరిధిలోని 11కేవీ రాజబొల్లారం తండా, అర్షద్ ఫౌల్ట్రీ ఫీడర్ల పరిధిలో శ్రీజ అగ్రిటెక్, అనం అగ్రో, క్యానెక్స్ ప్యాకెజింగ్, అర్షద్ ఫౌల్ట్రీ, రవుజా పౌల్ట్రీ ఫామ్స్, సిమ్ కార్డు కంపెనీ, రియల్ అగ్రో ఇండస్ట్రీస్, మోనార్క్ 2, రాజబొల్లారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం విధించనున్నట్లు ఏఈ తెలిపారు.

**శామీర్‌పేట పరిధిలో..**

శామీర్‌పేట: జగ్గంగూడ, సంపన్‌బోల్ ప్రాంతాల్లో నిక్మార్ కళాశాల, అల్ఫామెడ్, హెరిటేజ్, కీర్తి ఫౌల్ట్రీ, సెజెంట, సెమి కంపెనీలు, వ్యవసాయ క్షేత్రాలకు శుక్రవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయడం జరుగుతుందని ఏఈ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు.

**జవహర్‌నగర్ పరిధిలో..**

జవహర్‌నగర్: లక్ష్మీనర్సింహస్వామి ఫీడర్ పరిధిలోని చెన్నాపురం, లక్ష్మీనగర్‌కట్టా, నెహ్రూనగర్, శివనగర్, జయశంకర్‌కాలనీ, లెప్రాసీకాలనీ, మదర్‌థెరిస్సాకాలనీ, సిటిజెన్స్‌కాలనీ, శాంతినగర్, మూడుగుళ్ళు, చిలుకలబిల్డింగ్, రేణుకా ఎల్లమ్మ టెంపుల్, ఆదర్శనగర్, వికలాంగులకాలనీ ప్రాంతాల్లో ఉదయం 10:30 నుంచి 12:30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని... చెన్నాపూర్ ఫీడర్ పరిధిలో సీఆర్‌పీఎఫ్, మల్లెలగూడ, అరుంధతినగర్, ఫారూక్‌బస్తీ, ఫారానగర్, మల్కారం, డంపింగ్‌యార్డ్, పుల్లయ్య క్రషర్, గోశాల ప్రాంతాల్లో మధ్యాహ్నం 3నుంచి 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఏఈ ఎర్రన్న తెలిపారు.

# ఆర్టీసీలో ఆరోగ్య శిబిరం



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న డిపో మేనేజర్ సుధాకర్

మేడ్చల్, మే 30 : మేడ్చల్ ఆర్టీసీ డిపోలో గురువారం వైద్య ఆరోగ్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ సుధాకర్ మాట్లాడుతూ ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఆదేశాల మేరకు గురువారం మేడ్చల్ డిపోలో ఆరోగ్య పరీక్షల శిబిరాన్ని ప్రారంభించినట్టు తెలిపారు. గ్రాండ్ హెల్త్ ఛాలెంజ్ 2 కార్యక్రమంలో భాగంగా ఆర్టీసీ ఉద్యోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. వచ్చే నెల 5వ తేదీ వరకు శిబిరం జరుగుతుందని, ప్రతి ఉద్యోగికి పరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ రామారావు, డిపో ఉద్యోగులు, వైద్య నిపుణులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాద బాధితులను ఆదుకోవాలి



డీఈ మాధవచారికి వినతిపత్రం సమర్పిస్తున్న సీపీఐ నాయకులు

జవహర్‌నగర్, మే 30: రోడ్డు ప్రమాదంలో గాయపడిన మున్సిపల్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను ప్రభుత్వం, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఆదుకోని, వారి కుటుంబాలకు నష్ట పరిహారం చెల్లించాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎన్ బాలమల్లేష్‌యాదవ్ విజ్ఞప్తి చేశారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన రవి, నరేష్‌లకు మెరుగైన చికిత్స అందించి, నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ గురువారం జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో కమిషనర్ తాజ్‌మోహన్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు.

# నిర్మాణ వ్యర్థాలు బహిరంగ ప్రదేశాల్లో వేస్తే కఠిన చర్యలు

ఉప్పల్, మే 30: ఇంటి నిర్మాణ వ్యర్థాలు బహిరంగ ప్రదేశాల్లో వేస్తే చర్యలు తీసుకుంటామని ఉప్పల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఆంజనేయులు హెచ్చరించారు. వ్యర్థాలు వేసేవారికి అవగాహన కల్పించడానికి పలు కూడళ్లు, ప్రధాన రహదారుల్లో ప్లెక్సీలను ఏర్పాటు చేశారు. పర్యవేక్షణకు ప్రత్యేకంగా సిబ్బందిని నియమించి, సీసీ కెమరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నిబంధనలు పాటించని వారిపై జరిమానా విధిస్తామని హెచ్చరించారు. వ్యర్థాలను సంబంధిత అధికారులకు తెలియజేసి, రుసుము చెల్లించడం ద్వారా తీసుకువెళ్తారని పేర్కొన్నారు. నిబంధనలు పాటించి, అధికారులకు సిబ్బందికి సహకరించాలని కోరారు.




ఏర్పాటు చేసిన ప్లెక్సీ

# సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ



కీసరలో ఓ ఫర్టిలైజర్‌షాప్‌లో రికార్డును చూస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మేరిరేఖ

కీసర, మే 30: రైతులకు రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్నాయని జిల్లా వ్యవసాయాధికారి మేరిరేఖ తెలిపారు. మండల ప్రాథమిక సహకార సంఘం కార్యాలయాన్ని గురువారం ఆమె సందర్శించి రైతులకు పంపిణీ చేస్తున్న పచ్చిరొట్టే విత్తనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ సంవత్సరం 347 క్వింటాళ్ల పచ్చిరొట్టే విత్తనాలను సహకార సంఘాల ద్వారా అందిస్తున్నామన్నారు. మండలంలోని ఫర్టిలైజర్ షాప్ యజమానులు నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. కీసరలోని శ్రీ సాయి ఫర్టిలైజర్‌షాప్, ధనలక్ష్మీ హోం ఫర్టిలైజర్ షాప్‌లనుఆమె తనిఖీ చేశారు.

# ఎల్‌ఓసీ పత్రం అందజేత



మల్లేశ్ యాదవ్‌కు ఎల్‌ఓసీ పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి.

రామంతాపూర్,మే 30: రోగులకు మెరుగైన వైద్యం కోసం సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే బండారి లక్ష్మా రెడ్డి అన్నారు. గురువారం రామంతాపూర్ డివిజన్ బాలాజీ నగర్ కు చెందిన మల్లేశ్ యాదవ్ కు ముఖ్యమంత్రి సహాయం నిధి నుంచి మంజూరైన 1లక్షా 50 వేల ఎల్ఓసీ పత్రాన్ని ఆయనకు క్యాంపు కార్యాలయంలో అందజేశారు.కార్యక్రమంలోబీఆర్ఎస్ నాయకులు నాగేశ్వర్‌రావు, పవన్‌కుమార్, చాంద్‌పాష, సూరంశంకర్,పాపిరెడ్డి, ఆనంద్, టోనితదితరులు పాల్గొన్నారు.

## విత్తనాల కొనుగోలులో జాగ్రత్త వహించాలి



రాజబొల్లారంలో రైతుల అవగాహన కల్పిస్తున్న అధికారులు

మేడ్చల్ రూరల్, మే 30: మండలంలోని కోనాయిపల్లి, డబిల్‌పూర్, రాజబొల్లారం, రాజబొల్లారం తండాలో విత్తన కొనుగోలులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వ్యవసాయ అధికారులు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు.ప్రభుత్వ అనుమతి ఉన్న డీలర్ వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలని, విత్తనాల కొన్నప్పుడు రసీదు తీసుకోవాలని ఈ సందర్భంగా రైతులకు వారన సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి అర్చన, విస్తర్ణ అధికారులు సుమిత, తేజశ్వని, ఆయా గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.


## చెత్త వేయొద్దు.. అపరిశుభ్రం చేయొద్దు



పారిశుధ్యంపై ప్రచారం చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

నేరేడ్‌మెట్, మే 30: రోడ్లపై చెత్త వేయొద్దు అపరిశుభ్రం చేయొద్దని మల్కాజిగిరి సర్కిల్ శానిటరి సూపర్‌వైజర్ నాగరాజు ప్రజలకు సూచించారు. గురువారం నేరేడ్‌మెట్ డివిజన్ పరిధలోని పలు కాలనీల్లో బస్తీ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా రోడ్లపై చెత్త వేయవద్దని ఇంటింటికి వెళ్లి మహిళలకు బొట్టుపెట్టి అవగాహన కల్పిస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తడి పొడి చెత్తను వేయడానికి ఇప్పటికే గత ప్రభుత్వం రెండు బుట్టలను అందజేసిందని అన్నారు. ఉదయాన్నే కాలనీలు, బస్తీలకు వచ్చే ఆటోలలో చెత్తవేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల కోసం నిరంతరం శ్రమిస్తాం...



కాలనీవాసులతో మాట్లాడుతున్న పరమేశ్వర్‌రెడ్డి

ఉప్పల్, మే 30 : ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడానికి నిరంతరం శ్రమిస్తామని ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చారిజ మందుముల పరమేశ్వర్‌రెడ్డి అన్నారు.ఉప్పల్‌లో గురువారం ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ కాలనీల ప్రజలు పలు సమస్యలను ఆయనకు తెలియజేశారు. అనంతరం సమస్యలను తెలియజేస్తూవినతిపత్రాలుఅందించారు.

## ఎమ్మెల్యేను కలిసిన సిల్వర్ క్రెస్ట్ అసోసియేషన్ సభ్యులు

కాప్రా, మే 30: కాప్రాడివిజన్‌కు చెందిన సిల్వర్ క్రెస్ట్ కాలనీ నూతనకమిటీ సభ్యులు గురువారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసారు. ఆయనకు పూలమొక్కను అందజేసి, శాలువాతో సత్కరించారు. కాలనీ నూతన కమిటీ సభ్యులకు ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. సిల్వర్ క్రెస్ట్ కాలనీ అభివృద్ధి, సంక్షేమం కోసం కృషి చేయాలని ఎమ్మెల్యేకు కాలనీ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బైరి నవీన్‌గౌడ్, సిల్వర్ క్రెస్ట్ కాలనీ అసోసియేషన్ అధ్యక్షురాలు రజిత, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



# అక్రమ పార్కింగ్‌పై చర్యలు తీసుకుంటాం..

చర్లపల్లి, మే 30: చర్లపల్లి పారిశ్రామికవాడ ఫేజ్ 3లో అక్రమ పార్కింగ్‌పై చర్యలు తీసుకుంటున్నామని పారిశ్రామికవాడ ఫేజ్ 3 అధ్యక్షుడు మియ్యాపురం రమేశ్, ఐఓసీఎల్ పరిశ్రమ ప్రతినిధి రహుల్‌గుప్తాలు పేర్కొన్నారు. పారిశ్రామికవాడలోని ఇండియన్ అయిల్ కార్పొరేషన్ ఆఫ్ లిమిటెడ్, పారిశ్రామికవాడ ఫేజ్ 3 సీఐఏ ప్రతినిధులు, ఐలా ప్రతినిధులు ఐఓసీఎల్ పరిశ్రమలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పారిశ్రామికవాడలో ట్రాఫిక్ సమస్యలను అధిగమించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ముఖ్యంగా చమురు పరిశ్రమల లారీలు ఎక్కడపడితే అక్కడ పార్కింగ్ చేస్తే చర్యలు తీసుకుంటున్నామని వారు తెలిపారు. అనంతరం సీఐఏ ఉపాధ్యక్షులు సురేశ్, బాబా అలీ, కోశాధికారి సతీష్‌బాబు, చర్లపల్లి ఐలా కార్యదర్శి వెంకటేశ్వర్‌రెడ్డి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పారిశ్రామికవేత్తలు, సీఐఏ కమిటీ సభ్యులు శేషిరెడ్డి, వైఎస్ఎన్.మూర్తి, రాజశేఖర్, వెంకటేశ్, సురేందర్‌చారి, రాజ్‌కిరణ్, హరీష్‌రెడ్డిలతో పాటు ఐఓసీఎల్ సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశమైన చర్లపల్లి పారిశ్రామికవాడ ఫేజ్ 3 సీఐఏ ప్రతినిధులు, ఐఓసీఎల్ ప్రతినిధులు

# వైకుంఠధామాన్ని పశువుల పాకగా మార్చితే చర్యలు తప్పవు

శామీర్‌పేట, మే 30: వైకుంఠదామాన్ని పశువుల పాకగా, అపరిశుభ్రంగా మార్చితే చట్టపరమైన చర్యలు తప్పవని పంచాయతీ కార్యదర్శి మౌనిక హెచ్చరించారు. సర్వే నంబర్ 37, 38లోని యాదవుల వైకుంఠధామంలో ప్రజల సౌకర్యార్థం నల్లాలు, ఆడవాళ్లు, మగవాళ్లు బట్టలు మార్చుకోవడానికి స్నానాలు చేసుకోవటానికి గతంలో రూములు ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. బుధవారం జరిగిన అంత్యక్రియల్లో ఆడవాళ్లు స్నానాలకు వెళ్ళినప్పుడు ఆ గదిలో పశువులకు సంబంధించిన రబ్బిస్, చెత్తా, చెదారం నల్లాలు కూడా విరిగిపోయి పని ఉన్న విషయాన్ని గుర్తించిన ప్రజలు పంచాయతీ కార్యాలయం దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన పంచాయతీ అధికారులు గురువారం నోటీలు జారీ చేశారు. వైకుంఠధామంలోకి పశువులు కట్టేస్తే, చెత్తా చెదారం వేస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిల్ కలెక్టర్లు, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.



నోటీసు జారీ చేస్తున్న పంచాయతీ అధికారులు

## స్కూల్ బ్యాగ్స్, నోటు పుస్తకాల పంపిణీ

ఉప్పల్, మే 30 : వెస్ట్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చైల్డ్ సపోర్ట్ ఫౌండేషన్ గణేష్‌రెడ్డి, సంజీవ్ సహకారంతో ఉప్పల్ బీరప్పగడ్డ కమ్యూనిటీహాల్‌లో గురువారం పేద విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్, నోటు పుస్తకాలు, పెన్సిల్స్ గురువారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు శివకుమార్, కాలనీవాసులు పాల్గొన్నారు.



విద్యార్థులకు నోటుపుస్తకాలు, స్కూల్ బ్యాగ్స్ అందజేస్తున్న ప్రతినిధులు

## క్షయ వ్యాధి నిర్మూలనకు కృషి చేయాలి



సమావేశ మందిరాన్ని ప్రారంభిస్తున్న అడిషనల్ కలెక్టర్ అభిషేక్ అగస్త్య

మేడ్చల్ కలెక్టరేట్, మే 30 : జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో గురువారం సమావేశ మందిరాన్ని అడిషనల్ కలెక్టర్ అభిషేక్ అగస్త్య ప్రారంభించారు. ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ శాఖకు సంబంధించిన శిక్షణా కార్యక్రమాలు, సమీక్షా సమావేశాల నిర్వహణ కోసం ఈ సమావేశ మందిరాన్ని ఏర్పాటు చేశారు. సమావేశ మందిరాన్ని ప్రారంభించిన అనంతరం అడిషనల్ కలెక్టర్ అభిషేక్ అగస్త్య బీసీజీ టీకాపై జిల్లా స్థాయి క్యాస్కేట్ శిక్షణకు హాజరైన వైద్య అధికారులు, పారా మెడికల్ సిబ్బందిని ఉద్దేశించి ప్రసంగించారు. విధులను శ్రద్ధగా నిర్వహించాలని, క్షయ వ్యాధి నిర్మూలనకు కృషి చేయాలని సూచించారు.

# రోడ్డును ఆక్రమించిన భవన యజమానిపై చర్యలు తీసుకోవాలి



ఆక్రమణకు గురైన స్థలం ఇదే..

దుండిగల్,మే 30 :హెచ్ఎండీఏ అనుమతుల పేరుతో రోడ్డును ఆక్రమించి నిర్మిస్తున్న భవనం యజమానిపై చర్యలు తీసుకోవాలంటూ నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ నేత, ప్రగతినగర్ పంచాయతీ మాజీ ఉపసర్పంచ్ చల్లా సుధీర్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం ఆయన నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ రామకృష్ణ, టౌన్ ప్లానింగ్ సెక్షన్ అధికారి ప్రశాంతిలను కలిసి సదరు నిర్మాణంపై చర్యలు తీసుకునేందుకు ఎందుకు వెనకడుగు వేస్తున్నారో తెలుపాలంటూ నిలదీశారు. నిజాంపేట్ కార్పొరేషన్, ప్రగతినగర్‌లోని పట్టాభిరామాంజనేయ దేవస్థానం ఎదుట ఓ బిల్డర్ 30 ఫీట్ల రోడ్డును ఆక్రమించి నిర్మాణం చేపడుతున్నాడని, ఈ విషయంలో తాను ఎన్నోసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ఎందుకు స్పందించడంలేదో తెలుపాలన్నారు. పంచాయతీగా ఉన్న సమయంలో సదరు స్థలాన్ని పార్కు లేదా పాఠశాల నిర్మాణం కోసం కేటాయించారని, తదనంతరం ఇండ్ల స్థలాలకు డిమాండ్ పెరుగడంతో తప్పుడు లే అవుట్లు సృష్టించి హెచ్ఎండీఏ నుంచిడి అనుమతులు పొందారని పేర్కొన్న ఆయన స్థానిక మున్సిపల్ అధికారులు క్షత్రస్థాయి పరిశీలన జరుపకుండానే ఎలా అప్రూవల్ ఇచ్చారని ప్రశ్నించారు. దీనిపై పూర్తి స్థాయి విచారణ జరిపి రోడ్డుస్థలాన్ని కాపాడాలని,అదే విధంగా బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. హెచ్ఎండీఏ అధికారులకు ఫిర్యాదు చేశామని, అధికారులు స్పందించని పక్షంలో న్యాయపోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ సైట్‌కు సంబంధించిన అన్ని ఆధారాలు తన వద్ద ఉన్నాయన్నారు. అదే విధంగా ప్రగతినగర్‌లోని 13 పార్కుల్లో వెలసిన నిర్మాణాలను గుర్తించాలని కోరారు. స్పందించిన కమిషనర్ దీనిపై విచారణ జరిపి తగు చర్యలు తీసుకుంటామన్నారు.

## ఘనంగా సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం



జెండావిష్కరణలో కార్మిక నాయకులు

ఉప్పల్, మే 30: నాచారం పారిశ్రామికవాడలో గురువారం సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ కార్యదర్శి గణేష్ హాజరై పలు ప్రాంతాల్లో జెండాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎండి.అబ్దుల్లా, రాజకుమార్, ప్రకాశ్, శ్రీహరి, శ్రీకాంత్, తిరుపతిరెడ్డి, పరమేష్, శ్రీనివాస్‌రెడ్డి, రాజేశ్వర్, వెంకట్‌నారాయణరెడ్డి, సంతోష్, రాజు పాల్గొన్నారు.

# ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత



కుటుంబసభ్యులతో కలిసి పూజల్లో పాల్గొన్న వంశీమోహన్‌రెడ్డి, గూడూరి చెన్నారెడ్డి

అల్లాపూర్,మే30;ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గూడూరి చెన్నారెడ్డి అన్నారు.హేమావతినగర్ శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం ప్రాంగణంలో శివాలయం అవరణలో గత నెల దాతలు వంశీమోహన్‌రెడ్డి(డిఎస్‌పి) శ్రీమతి శోభారెడ్డి,మాస్టర్ కనిష్క్,లీలా వంశీరెడ్డి కుటుంబసభ్యులు నూతన ధ్వజస్తంభం ప్రతిష్ఠించారు.ఇందులో భాగంగా గురువారం వంశీమోహన్‌రెడ్డి ధ్వజస్తంభానికి ఇత్తడి తొడుగును తొడిగించి కుంటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు చేశారు.కార్యక్రమంలో పాల్గొన్న గూడూరి చెన్నారెడ్డి, మాట్లాడుతూ...శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ అభివృద్ధి ప్రత్యేక చొరవ చూపిన దాతలు వంశీమోహన్ రెడ్డి కృషి అభినందనీయమన్నారు.కార్యక్రమంలో పూజారులు భీమేశ్వర శర్మ,నితిన్ శర్మ,డాక్టర్ గూడూరి విజయలక్ష్మి పాల్గొన్నారు.

## ఉప్పల్ పీహెచ్‌సీలో అల్ట్రాసౌండ్ సేవలు షురూ..



అల్ట్రా సౌండ్ సేవలను ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో రఘునాథస్వామి

మేడ్చల్ కలెక్టరేట్, మే 30 : ఉప్పల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అల్ట్రా సౌండ్ సేవలను గురువారం డీఎంహెచ్‌వో డాక్టర్ రఘునాథ స్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ దవాఖానలపై ఆధారపడిన రోగులకు నాణ్యమైన వైద్య సేవలను ఉచితంగా అందించాలనే లక్ష్యంతో అల్ట్రాసౌండ్ సేవలను ప్రారంభించామన్నారు. ప్రతి బుధ, శుక్ర, శనివారాల్లో అల్ట్రా సౌండ్ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ నారాయణరావు, ప్రోగ్రాం అధికారి డాక్టర్ పద్మావతి, రేడియాలజిస్టు డాక్టర్ పుష్పాంజలి, వైద్యాధికారి సౌందర్యలత పాల్గొన్నారు.

## నర్రా రిషితారెడ్డికి డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న రిషితారెడ్డి

మల్లాపూర్, మే 30: సామాజిక సేవకురాలిగా అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్న కాప్రా సర్కిల్ మీర్‌పేట్ హెచ్‌బీకాలనీ డివిజన్ కృష్ణానగర్‌కాలనీకి చెందిన నర్రా రిషితారెడ్డికి అమెరికాలో టెక్సాస్‌లోని డేస్ప్రింగ్ థియలాజికల్ విశ్వవిద్యాలయం గురువారం హైదరాబాద్‌లో గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఈ సందర్భంగా రిషితారెడ్డి మాట్లాడుతూ తాను చేసిన సామాజిక సేవా కార్యక్రమాలను గుర్తించి గౌరవ డాక్టరేట్ అందజేసిన విశ్వ విద్యాలయం ప్రతినిధులకు ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## రేపటి నుంచి ఉచిత స్పోకెన్ ఇంగ్లిషు శిక్షణ తరగతులు

చర్లపల్లి, మే 30: ఏఎస్‌రావునగర్ డివిజన్ కమలానగర్‌లో ఎస్ఎఫ్ఐ, పీపుల్స్ వెల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఉచిత స్పోకెన్ ఇంగ్లిషు తరగతులను సద్వినియోగం చేసుకోవాలని పీపుల్స్ వెల్ఫేర్ ట్రస్ట్ ప్రతినిధి వెంకటేశ్వర్‌రావు, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రాథోడ్ సంతోష్ పేర్కొన్నారు. గురువారం ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో వారు మాట్లాడుతూ జూన్ 1వ తేదీ నుంచి నెల పాటు శిక్షణ తరగతులను నిర్వహిస్తామని, నిత్యం సాయంత్రం 6 నుంచి 8గంటల వరకు ఈ తరగతులను నిర్వహిస్తామని తెలిపారు.

## 3న ఉచిత చెవి వైద్య శిబిరం

మేడ్చల్, మే 30 : మేడ్చల్ పట్టణంలోని ఆదిత్య హాస్పిటల్ ఆధ్వర్యంలో వచ్చే 3, 4 తేదీల్లో ఉచిత వినికిడి వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్టు ఆస్పత్రి డాక్టర్ కిశోర్ తెలిపారు. రెండు రోజుల పాటు ఉదయం 10నుంచి సాయంత్రం 8 గంటల వరకు వైద్యశిబిరం ఉంటుందన్నారు. వినికిడి లోపం ఉన్న వారికి అత్యాధునిక పరికరాల తో పరీక్షలు నిర్వహిస్తామని, వినికిడి లోపంతో బాధపడుతున్న వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

## సర్కారు బడుల్లో వసతులు కల్పించాలి

ఉప్పల్, మే 30: విద్యాసంవత్సరానికి ముందే అన్ని ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలని ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా సమితి ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఉప్పల్ ప్రభుత్వ పాఠశాలలో గురువారం సర్వే నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో మరమ్మతులు చేపట్టాలని, మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత యువజన సమాఖ్య, బాల సంఘం జిల్లా సమితి ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వలి ఉల్లా ఖాద్రీ, ప్రధాన కార్యదర్శి ధర్మేంద్ర, జిల్లా కార్యదర్శి సత్యప్రసాద్, నేతలు శ్రీకాంత్, శేఖర్, గిరిబాబు, కీర్తన్, రవళి, మధురిమ, రమ్య, సౌజన్య పాల్గొన్నారు.